క్లుప్తంగా

వలస వెళ్లొద్దు



మాట్లాడుతున్న పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్

ఆస్పరి: వలస వెళ్లకుండా స్థానికంగానే తాము కల్పించే ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్ కూలీలకు సూచించారు. మంగళవారం స్థానిక బీసీ కాలనీలో కూలీలతో మాట్లాడారు. కుటుంబాలను వదిలి వేరే ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడొద్దని సూచించారు. తాము కల్పించే పనుల్లో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. 8 వారాల నుంచి వేతనాలు అందడం లేదని, పాత పద్ధతులలోనే పనులు కల్పించాలని కూలీలు కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీడీఓ మల్లేశ్వరి, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కండి

హొళగుంద: గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సర్పంచ్ కురువ చాముండేశ్వరి వార్డు సభ్యులకు సూచించారు. మంగళవారం ఎల్లార్తి సచివాలయంలో వార్డు మెంబర్లతో కలిసి గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీకి ఆదాయ వనరుల పెంపు పై దృష్టి సారించాలన్నారు. తద్వారా వచ్చే నిధులను అభివృద్ధి పనులకు వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ షఫీ పాల్గొన్నారు.

పిల్లలను చదివించుకోండి



మాట్లాడుతున్న దిశ డీఎస్పీ వెంకట్రామయ్య

కృష్ణగిరి: గొడవలకు దూరంగా ఉండిద ప్రతి ఒక్కరూ తమ పిల్లలను బాగా చదివించుకోవాలని కర్నూలు దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ వెంకట్రామయ్య సూచించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని బోయ బొంతిరాళ్ల గ్రామంలో సీఐ యుగంధర్, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డిలతో కలిసి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. అందరూ కలిసి గ్రామాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. గ్రామంలో ఏ చిన్న సమస్య ఎదురైనా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ తగదు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య

పత్తికొండ రూరల్: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయడం తగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. ఆపార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక నాలుగు స్తంభాల కూడలిలో రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు నినాదంతో ముందుకు సాగుతామన్నారు. ఎంతోమంది బలిదానాలతో ఉక్కుపరిశ్రమ ఏర్పడి లక్షల మంది కార్మికులకు ఉపాధి పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి క్రిష్ణయ్య, నాయకులు నెట్టికంటయ్య, రంగన్న, పెద్దఈరన్న, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

మరమ్మతులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

మద్దికెర: మండల కేంద్రం నుంచి బురుజుల గ్రామానికి వెళ్లే రహదారికి రూ.40 లక్షలతో మరమ్మతుల(ప్యాచ్ వర్క్)ను మంగళవారం ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి ప్రారంభించారు. సర్పంచ్ బండారు సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ



ఆలూరు రూరల్: మండలంలోని మనేకుర్తి గ్రామంలో దేవమ్మ అవ్వ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఆలయంలో వేదపండితుల చేత ప్రాతఃకాల పూజ, యంత్ర, ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి, మహామంగళ హారతి తదితర పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆలయానికి వచ్చి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీ ఎత్తున్న తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రతి పేదవాడికీ సంక్షేమ ఫలాలు

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



దౌల్తాపురంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జయరాం

ఆలూరు/చిప్పగిరి: రాజకీయాలకు అతీతంగా ప్రతి పేదవాడికీ సంక్షేమ ఫలాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. మంగళవారం మండలంలోని నంచర్ల, దౌల్తాపురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దౌల్తాపురంలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయాన్ని మంత్రి జయరాం ప్రారంభించారు. గ్రామ సచివాలయ సిబ్బందితో గ్రామంలో అమలైన సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలని వారిని ఆదేశించారు. అనంతరం దౌల్తాపురం, నంచర్ల గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ మూడున్నరేళ్లలో నంచర్ల గ్రామానికి రూ.6.55 కోట్ల లబ్ధి చేకూరిందని వివరించారు. అలాగే గ్రామంలో నెలకొన్న తాగు నీటి సమస్యకు నెల రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లోనూ జగనన్నకు అండగా నిలవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మంత్రి సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు నారాయణ స్వామి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణ, వైస్ ఎంపీపీ నరసింహులు, నంచర్ల, దౌల్తాపురం సర్పంచులు భీమా, లక్ష్మీదేవి, పార్టీ నాయకులు గోవిందరాజులు, శ్రీధర్, మల్లికార్జున, రాజన్న, రంగస్వామి, ప్రకాష్ రెడ్డి, శేఖన్న, ధర్మేంద్ర, సూరి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి సహకారం..

నంచర్ల గ్రామానికి చెందిన బోయ దొరబాబు, రంగవేణి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. రెండో కుమార్తె మస్తానమ్మకు పుట్టుకతోనే మెడపై చిన్న పాటి గడ్డలాంటిది ఉంది. పాప వయసుతో పాటు గడ్డ కూడా పెరుగుతూ వస్తోంది. పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చూపించినా నయం కాలేదని దొరబాబు, రంగవేణి దంపతులు మంత్రి దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన ఆరోగ్య శ్రీద్వారా మెరుగైన వైద్య చికిత్సలు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



నంచర్లలో బాలిక ఆరోగ్యంపై ఆరా తీస్తున్న మంత్రి

పాఠశాలల తనిఖీ

నందవరం: మండల పరిధిలోని ఇబ్రహీంపురం జెడ్పీ, ఎంపీపీ పాఠశాలలను మంగళవారం ఎంపీడీఓ కృష్ణమూర్తి తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించాలన్నారు. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేయాలని సూచించారు. అలాగే గ్రామంలోని సీసీ రోడ్డు, డ్రైయినేజీ నిర్మాణాలకు ఎంపీడీఓ ఆధ్వర్యంలో సర్పంచ్ నాగేశ్వరరెడ్డి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు బసవరాజు, లక్ష్మన్న, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ జయన్న, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు డీలర్ రాముడు, సక్కరప్ప, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మద్దికెర: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని సర్పంచ్ సుహాసిని, పంచాయతీ కార్యదర్శి శ్రీహరి అన్నారు. మంగళవారం స్థానిక సచివాలయంలో వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబాలను మ్యాపింగ్ చేసి, పథకాలు ఇంటింటికి చేరేలా చూడాలన్నారు.

నిబంధనలపై అవగాహన అవసరం

- ఆర్టీఓ జీవీ శివారెడ్డి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఆర్టీఓ శివారెడ్డి

ఎమ్మిగనూరు టౌన్: రహదారి నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్టీఓ జీవీ శివారెడ్డి అన్నారు. బనవాసి జవహర్ నవోదయ పాఠశాలలో రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణలపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతకుముందు వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే వాహనాలను నడపాలన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అనంతరం ఎంవీఐ శిశిరదీప్తి రోడ్డు ప్రమాదాలు, నివారణ తదితర అంశాలపై వివరించారు సమావేశంలో నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ సాగరిక పాల్గొన్నారు.

- ఆలూరు: రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా వాహనాలు నడపాలని దేవనకొండ ఎస్ఐ భూపాలుడు వాహన డ్రైవర్లకు సూచించారు. దేవనకొండ మండలం కరివేములలో మంగళవారం రోడ్డు ప్రమాదాల నివారణపై ఆటో డ్రైవర్లకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం తగదన్నారు. అలాంటి వారిపై జరిమానా విధిస్తామని హెచ్చరించారు. తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి ట్రాఫిక్ నిబంధనాలను పాటించాలని సూచించారు.



కరివేములలో ఆటో డ్రైవర్లు, స్థానికులతో మాట్లాడుతున్న ఎస్ఐ భూపాలుడు

గురుకులం విద్యార్థినుల ప్రతిభ



వెండి పతకాలు సాధించిన విద్యార్థినులతో కళాశాల బృందం

కృష్ణగిరి: ఈనెల 21 నుంచి 23 వరకు బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి షూటింగ్ బాల్ క్రీడలో కంబాలపాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకులం విద్యార్థినులు విశేష ప్రతిభ చూపారు. జూనియర్ బైపీసీ విద్యార్థినులు జ్యోతిప్రియ, చిన్నారిలు రెండో స్థానంలో నిలిచి వెండి పతకాలు సాధించినట్లు గురుకులం ప్రిన్సిపాల్ ఆర్ అరుణ కుమారి తెలిపారు. మంగళవారం క్రీడాకారిణులను, తర్ఫీదునిచ్చిన డీపీ లోకేశ్వరి, పీఈటీ రాజేశ్వరిలను అభినందించారు. తమ కళాశాల నుంచి ఈనెల 12 నుంచి 13వ తేదీ వరకు జరిగిన సౌత్‌జోన్ షూటింగ్‌బాల్ పోటీలలో సైతం జూనియర్ విభాగంలో టెన్త్ క్లాస్ మధులత బంగారు పతకాన్ని, సీనియర్ విభాగంలో జూనియర్ బైపీసీ విద్యార్థిని కుమారి వెండి పతకాన్ని సాధించినట్లు తెలిపారు. సమావేశంలో గురుకులం వైస్ ప్రిన్స్‌పాల్ సుజాత, అధ్యాపక, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బాలికా విద్యతోనే సమాజ ప్రగతి

తుగ్గలి: బాలికా విద్యతోనే సమాజ ప్రగతి సాధ్యమని సీడీపీఓ సావిత్రి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం రాతన ఆశ్రమ గిరిజన బాలికల పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల బాలికలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బాలికా విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఐసీడీఎస్ కూడా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. అంగన్‌వాడీల ద్వారా పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నట్లు చెప్పారు. బాలికలు ధైర్యంగా సమస్యలు ఎదుర్కొని జీవితంలో నిలబడాలన్నారు. అనంతరం ఆటలపోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీడీఎస్ సూపర్‌వైజర్లు సౌభాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, సుమిత్ర, సావిత్రి, పాఠశాల ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న సీడీపీఓ సావిత్రి

పత్తికొండ విద్యార్థుల ప్రతిభ



వ్యాసరచన పోటీలో విజేత గోకుల్‌రెడ్డిని అభినందిస్తున్న ఎంఈఓ మస్తాన్‌వలి



మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రేష్మాకౌసర్‌తో విజేతలు

పత్తికొండ రూరల్: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన వక్తృత్వ పోటీల్లో పత్తికొండ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వ్యాసరచన సీనియర్ విభాగంలో పత్తికొండ డిగ్రీ కాలేజీ విద్యార్థులు ఎస్.సుబాన్, ఎ.షమీన ప్రథమ, ద్వితీయ స్థానాలు, జూనియర్ విభాగంలో హైస్కూల్ విద్యార్థి గోకుల్ రెడ్డి తృతీయ స్థానం దక్కించుకున్నారు. వక్తృత్వం సీనియర్ విభాగంలో డిగ్రీ కాలేజీ విద్యార్థి అశోక్ కుమార్ మొదటి, జూనియర్ విభాగంలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి ఎస్.సలీంబాషా మొదటి బహుమతి గెలుచుకోగా శివరామకృష్ణ, రాజేష్ రెండో బహుమతి కైవసరం చేసుకున్నారు. వీరిని డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ మాధురి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రేష్మాకౌసర్, మండల విద్యాధికారి మస్తాన్‌వలి అభినందించారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

తుగ్గలి: అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం సాయంత్రం విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని దిగువ చెర్వుతండా తిరుమలాంజనేయస్వామి ఆలయం పక్కన గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా నిల్వ ఉంచిన 94.5క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ తహసీల్దార్ వెంకటనారాయణ, ఎస్ఐ హనుమంతయ్య తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పత్తికొండ ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించి, జొన్నగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. దాడుల్లో సివిల్ సప్లై డీటీ రమేష్, హెడ్‌కానిస్టేబుల్ సూర్యనారాయణ, వీఆర్వో లక్ష్మి పాల్గొన్నారు.



బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

నవోదయ దరఖాస్తు గడువు 31తో పూర్తి

తుగ్గలి: నవోదయ ప్రవేశ పరీక్ష కోసం ఈనెల 31వ తేదీలోగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ రామవెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. నవోదయ ప్రవేశ పరీక్షకు 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. దరఖాస్తు నవోదయ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 29న పరీక్ష ఉంటుందన్నారు.

వలంటీర్లు బాధ్యతతో పనిచేయాలి

తుగ్గలి: వలంటీర్లు బాధ్యతతో పనిచేసి అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్ఎం బాషా అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో మంగళవారం వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వలంటీర్లదే కీలక పాత్ర అని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. అర్హులై ఉండి ఏదైనా కారణంతో పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో జూనియర్ అసిస్టెంట్ రాంబ్రహ్మం పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

తుగ్గలి: ఫిబ్రవరి 5న కర్నూలులో నిర్వహించే ఏపీ జేఏసీ అమరావతి 3వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు రాముడు, సురిబాబు, మద్దిలేటి కోరారు. మంగళవారం తుగ్గలిలో మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. సభకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ హాజరు కావాలని వారు కోరారు.

యాటకల్లులో దేవర

ఆస్పరి: మండలంలోని యాటకల్లు గ్రామంలో మంగళవారం సుంకులమ్మవ్వ, దుగ్గెమ్మవ్వ దేవర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో అమ్మవార్లకు గంగ, ఆకు పూజ, కుంకుమార్చన, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య రూ.52 వేల ఖర్చుతో సుంకులమ్మ, దుగ్గెమ్మవ్వ ఆలయాలను పూలతో అలంకరించారు. బుధవారం కుంభాల ఊరేగింపు ఉంటుందని గ్రామ పెద్దలు చెప్పారు.

ఘనంగా మార్కండేయ స్వామి జయంతి

హొళగుంద: పద్మశాలీల ఆరాధ్య దేవుడు మార్కండేయ స్వామి జయంతిని మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించుకున్నారు. పద్మశాలీలు స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహామంగళారతి, కాగడ హారతి, కుంకుమార్చన, అభిషేకాలు చేశారు.

పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

- ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్: పార్టీ బలోపేతానికి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి సూచించారు. స్థానిక ఉప్పర కల్యాణ మండపంలో మంగళవారం ఏర్పాటు చేసిన నందవరం, గోనెగండ్ల మండలాల పరిధిలోని సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ నెలాఖరులోగా గృహసారథులను నియమించుకోవాలని వారికి సూచించారు. అందరూ కలిసి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అవినీతి రహిత సమాజం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే ప్రతి పథకాన్ని పేదల దరికి చేర్చేందుకు వలంటీర్లను నియమించారనే విషయాన్ని ప్రజలకు చెప్పాలన్నారు. అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలను అందజేస్తున్న ముఖ్యమంత్రిని మరోసారి ఎన్నుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, ఆయా మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, శివప్పగౌడ్, విరుపాక్షిరెడ్డి, బందె నవాజ్, కాశీవిశ్వనాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మన్సూర్, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలో ప్లాస్టిక్ నిషేధానికి సహకరించి పర్యావరణాన్ని కాపాడేందుకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఫ్లెక్సీ దుకాణాల యజమానులతో ఆయన సమావేశమయ్యారు. ప్రతిఒక్కరూ 120 మైక్రాన్ల కంటే తక్కువ ఉండే ప్లాస్టిక్ కవర్లను, వస్తువులను వాడకూడదన్నారు. ఈనెల 26 నుంచి ఫ్లెక్సీలు, బ్యానర్లు నిషేధం అమల్లోకి వస్తుందన్నారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చేందుకు అందరు కృషి చేయాలన్నారు. సమావేశంలో టీపీఓ గోపాలకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, సత్యన్న తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

పట్టణంలోని వడ్డే సంఘ ఏరియా సచివాలయంతో పాటు ఖిబులా కాలనీ వార్డు సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల అమలు, వాటికి సంబంధించిన పోస్టర్లు, లబ్ధిదారుల సంఖ్య గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకందించే సేవల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందికి సూచించారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

భజన పోటీల విజేత ఆలంకొండ

ఆస్పరి: మండలంలోని తంగరడోణ గ్రామంలో వెలసిన చింతలమునిస్వామి, నల్లారెడ్డి స్వామి ఆరాధన సందర్భంగా సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి భజన పోటీల్లో ఆలంకొండ జట్టు విజేతగా నిలిచింది. మొత్తం 18 జట్లు పాల్గొన్నాయి. గెలుపొందిన ఆలంకొండ భజన బృందానికి మంగళవారం అర తులం బంగారం బహుమతిగా గ్రామ పెద్దలు అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన కర్నూలు పెద్ద పడకల వీధి బృందానికి 30 తులాలు వెండి, మూడో స్థానంలో నిలిచిన దొర్నిపాడు భజన బృందానికి 25 తులాల వెండి అందజేశారు. కార్యక్రమంలో శ్రీశైలం ఆలయ ట్రస్టు బోర్డు మెంబర్ విరుపాక్షయ్య స్వామి, గ్రామ పెద్దలు సీతారామిరెడ్డి, వెంకన్న, రంగన్న, హర్‌నాథ్‌రెడ్డి, ప్రతాప్ స్వామి, దస్తగిరి, వెంకటేష్, మునిస్వామి, రంగముని పాల్గొన్నారు.



ఆలంకొండ భజన బృందం సభ్యుడికి బహుమతి అందజేస్తున్న దృశ్యం


వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

గోనెగండ్ల: పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత శాతం సాధించాలి. ఇందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంఈఓ వినోద్‌కుమార్ సూచించారు. మంగళవారం వారు స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ షాహినా పర్వీన్, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.


బాలికలు ఉన్నతంగా ఎదగాలి

వెల్దుర్తి: బాలికలు బాగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(జీసీడీఓ) కె సునీత సూచించారు. మంగళవారం ఆమె అలెస్కో ఆర్ శ్రీనివాసులుతో కలిసి స్థానిక కేజీబీవీలో బాలికలతో సమావేశమయ్యారు. బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, వాటిని ఎలా ఎదుర్కోవాలో వివరించారు. బాలికల హక్కులు, అవకాశాల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను విశదీకరించారు. ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ బాలికలకు విద్య శ్రామిక శక్తిలోను విజయాలు సాధించే నైపుణ్యాలను పెంచుతుందన్నారు. బాలికలకు విద్య మరింత ఆత్మవిశ్వాసాన్నిస్తుందన్నారు. సమావేశంలో విద్యాలయం ప్రిన్సిపాల్ డి షాకీరా బేగం పాల్గొన్నారు.

- మద్దికెర: జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు ప్రిన్సిపాల్ అబిదాబేగం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కృష్ణవేణి అవగాహన కల్పించారు. ఆడపిల్లలు అంతరిక్షంలోకి వెళ్లి ఎందులోనూ తక్కువ కాదని నిరూపిస్తున్నారన్నారు. అన్ని రంగాల్లో రాణించి అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. విద్యను మధ్యలో నిలిపివేయకుండా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఇంటర్ తరగతులను ప్రవేశపెట్టిందన్నారు. ఉచితంగా ఉన్నత విద్యనభ్యసించి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.
- ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఎస్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బాలికా విద్యను ప్రోత్సహించడం, బాల్య వివాహలను అరికట్టడం అంశాలపై హెచ్ఎం గౌసియాబేగం, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు వివరించారు. అనంతరం సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, జరిన, రాధ, సుచరితలు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలు, గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు.
- నందవరం: బాలికల చదువు భవిష్యత్‌కు వెలుగని, బాల్య వివాహాలను అరికట్టడంలో అందరి బాధ్యత అని ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి, పిల్లల హక్కుల సంరక్షణ ఫోరమ్ జిల్లా కన్వీనర్ లింగన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలంలో బాల్య వివాహాల నిషేధంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలతో భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. ఆడపిల్లలను రక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అలాగే మగపిల్లలతో పాటు సమానంగా ఆడపిల్లలను పెంచాలని తల్లిదండ్రులను కోరారు. ఫోరమ్ సభ్యులు ఎల్లయ్య, రవి, పవన్, రాజు, మహేష్, మహిళా కోకన్వీనర్ శివలక్ష్మి పాల్గొన్నారు.



వెల్దుర్తి కేజీబీవీలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న జీసీడీఓ కె సునీత



నందవరం కేజీబీవీలో మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ లింగన్న